# పార్ట్‌టైమ్

అధర్మం–అక్రమం–అమానుషా–లతో ప్రజలు విర్రవీగి పోతున్నారు. (కలి) యుగధర్మాన్ని నాలుగు పాదాల నడిపించడం కోసమా అన్నట్లు ఒకరితో ఒకరు పోటీపడుతూ నిర్వర్తిస్తున్నారు తమ తమ విద్యుక్త ధర్మాల్ని! పైన సూర్యుడు వీళ్ళనీ, వీళ్ళ ధర్మాల్ని చూసి మరింత మండిపడుతున్నాడు. నిప్పుల్ని చెరిగిపోస్తున్నాడు. మండుతున్న సూర్యుడితోనే మాకు మాంచి స్నేహమంటూ ధరణిలోని ధరవరలు పైకి ఎగసిపోతున్న ఈ రోజుల్లోనే వెలగబెడ్తున్న గుమస్తాగిరి తాలూకు జీతం ఎటూ చాలక 'పార్ట్‌టైమ్' జాబ్ కోసం విశ్వప్రయత్నం చేస్తే అదృష్టవశాత్తు ఓ పెద్దమనిషి ఈ రోజు సాయంత్రం ఆరుగంటలకు వాళ్ళింటికి రమ్మన్నారు. అక్కడికి వెళ్దామని సూపర్ బజార్ దగ్గర పది నిముషాల్నుంచి వెయిట్ చేస్తున్నాను. బస్సులు వస్తున్నాయ్, వెళ్తున్నాయ్. కాని నాక్కావల్సిన బస్ మాత్రం రావటంలేదు.

సాయంత్రం ఐదుగంటలు దాటినా ఇంకా ఎండ తగ్గుముఖం పట్టలేదు– ముఖానికి పట్టిన చెమటని చేతి రుమాలుతో అద్దుకుని బస్‌రూట్‌వేపు చూడసాగేను. మరో ఐదు నిమిషాల్తర్వాత బస్‌వచ్చింది. ఆత్రంగా ఎక్కి సీట్ కోసం కలియజూస్తే అదృష్టం కొద్దీ సీటు కూడా దొరికింది.

“టికెట్, టికెట్’ అంటూ కండక్టర్

● సుస్మితా రమణమూర్తి

దగ్గరకొచ్చి నిల్చున్నాడు. జేబు లోంచి పర్స్ తీస్తుంటే నా ప్రక్కన కూర్చున్నతను రూపాయి నోటొకటి తీసి కండక్టర్‌కిస్తూ తను దిగాల్సిన స్థలంపేరు చెప్పాడు. కండక్టర్ కోపంతో ముఖాన్ని చిట్లించుకుంటూ – "అందరికీ ఇదో అలవాటైపోయింది. లింగులింగుమంటూ ప్రతివారూ పదిహేను పైసల టికెట్టుకి తలా ఒక రూపాయి నోటే— ఇక్కడ మేమేమైనా చిల్లర పండిస్తున్నామనుకున్నారా? పావలా టిక్కెట్లకే టికాణా లేదు—" అన్నాడు.

"వెధవది ఈ చిల్లర స్కేర్సిటీతో మా తగువొచ్చి పడింది!" అనుకుంటూ చిల్లరకోసం పర్స్‌లో చూశాను. నా దగ్గరకూడా చిల్లర లేదు. నేనుకూడా పదిహేను పైసల టిక్కెట్టుకి రూపాయి నోటిచ్చే మళ్ళీ కండక్టర్ ఇందాకటి దండకాన్ని వల్లిస్తాడు. ఈ బస్‌లో వెళ్ళకపోతే అనుకున్న టైముకి ఆ పెద్దమనిషిని కలుసుకోలేను. ఎలా?

వెంటనే మెరుపులా ఓ ఆలోచన తట్టింది. నా వెనకసీట్లో కూర్చునేవారిని మర్యాద వుట్టిపడేలా "ఎక్కడికి మీరు వెళ్తున్నారు?" అడిగేను. వాళ్ళు చెప్పేరు.

ఒకరు సింధియా జంక్షనుకి—మరొకరు నేవల్ బేసుకి. ఇద్దరివీ ముప్ఫైయైదు పైసల టిక్కెట్లే!

"నాదగ్గర చిల్లర లేదండీ! మీకభ్యంతరం లేకుంటే మీ టిక్కెట్లు నేనే తీస్తాను" అని వారి దగ్గర్నుండి రెండు ముప్ఫై ఐదులు తీసుకున్నాను. డెబ్భై పైసలు పర్సులో వేసుకుని—కండక్టర్‌కి రూపాయి నోటిచ్చి రెండు ముప్ఫైఐదులు, రెండు పదిహేనులు" అన్నాను. నా ప్రక్కనున్న తను మెచ్చుకోలుగా—కృతజ్ఞతగా నన్ను చూశాడు.

కండక్టర్ టిక్కెట్లు నా చేతికిస్తూ, "మీరేమీ అనుకోకండి సార్! మీరైనా కాస్త ఆలోచించండి. పదిహేను పైసల టిక్కెట్టుకి తలా ఓ రూపాయి నోటే మేమేం చేయగలం చెప్పండి! అక్కడికీ మేము రూపాయకి పావలాలు చొప్పున కమీషన్ మీద చిల్లర తెస్తున్నాం కూడా! ఐనా చాలటంలేదు" నా ప్రక్కనతనితో వినయంగా అన్నాడు.

అయినా నా ప్రక్కనున్నతను కండక్టర్ మాటలకి విసుక్కుంటూ "చిల్లర వుందనుకునే బస్సెక్కానయ్యా! తీరా చూస్తే జేబులోవున్నవి ఓ సత్తుపావలా పది పైసలూను! నేనేం జేసేది? రూపాయివ్వక తప్పలేదు. ఐనా నాకు తెలియక అడుగుతాను. అందరూ నీకు చిల్లరిస్తే మీరుమాత్రం ఏం జేసుకుంటారు? నాలాంటివారికొకరికో, ఇద్దరికో చిల్లరిచ్చినంత మాత్రాన మీకు తరిగేది మా కొరిగేది ఏమీ వుండదు. చిల్లర మాలక్ష్మి ఎలావస్తుందో అలానే పోతుంది. ఏమంటావ్?" అన్నాడు.

కండక్టర్ అతని మాటలకి చిరాగ్గా ముందుకి కదిలేడు.

కురుపామ్ మార్కెట్ దగ్గర నా ప్రక్కతను దిగుతూ—"నాదగ్గర నిజంగా

ఫోన్ : 497

శుచికి శుభ్రతకు
పెట్టింది పేరు!

అజంతా
హోటల్

ఎయిర్ కండీషన్డ్

రాజమండ్రి

చిల్లర లేదండీ! ఈ పది పైసలు...." అని ఇవ్వబోతుంటే—"ఫర్లేదండీ! ఆఫ్టరాల్ ఫిఫ్టీన్ పైసా ...." అన్నాను.

అతను థేంక్స్ చెప్పి వెళ్ళిపోయేడు.

ఒకటో నెంబరు పోలీసు స్టేషను దగ్గర బస్ దిగి ఆ పెద్దమనిషి ఇంటికేసి నడక సాగించాను. సరిగ్గా ఆరుగంటలకి అతనింటికి వెళ్ళినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

నా కోసంవే ఎదుర్చూసున్నట్లుంది ఆ పెద్దమనిషి. నే వెళ్ళేసరికి వీధిగుమ్మంలోనే నిల్చునివున్నారు. నన్ను చూసి —"రావోయ్ రా! నీ కోసమే చూస్తున్నాను" అంటూ తనగదిలోకి తీసుకెళ్ళారునన్ను. ఇద్దరం గదిలో ఎదురెదురుగా కూర్చున్నాం.

"రంగన్నా! రంగన్నా!" అని అతను పొలికేక పెట్టేసరికి — "ఆ! వస్తున్నా బాబూ!" అంటూ రంగన్న అనబడే ఆ వ్యక్తి మా ముందుకొచ్చి నిల్చున్నాడు.

"చూడు రంగన్నా! నీ వెళ్ళి అర్జంటుగా ఓ రెండు కూల్ డ్రింక్స్ పట్రా!" అంటూ రెండ్రూపాయలిచ్చేరు.

రంగన్న వెళ్ళింతర్వాత అతను నా వేపు చూస్తూ—"చూడు బాబూ! నీకు పార్ట్ టైం జాబ్ ఇవ్వడానికి నాకేంవీ అభ్యంతరంలేదు. కాని పని చిన్నదే ఐనా—అదెంత సులువైనదైనా బాధ్యత వహించి చేయాలి...." ఇంకా ఏదో చెప్పబోతూంటే — "బాబుగోరూ! శివాలయం దగ్గర్నుంచి ఆ పుల్లనొచ్చాడండి!" అంటూ రంగన్న డ్రింక్స్ తో

గదిలోకి వచ్చేడు. తనొకటి తీసుకుని, నాకొకటి ఇస్తూ అన్నారతను–"ఇంతకీ ఎంత పట్టుకొచ్చాడేఁవిటి?"

"ముప్పై రూపాయలండీ!"

"సరిగ్గా లెక్కపెట్టేవా?"

'ఒకటికి పదిసార్లు లెక్కపెట్టేనండి'

"సరే! ఈ మూడుపదులు వాడికిచ్చేసి–ఆ చిల్లర ఇక్కడికి తీసుకురా!" అంటూ జేబులోంచి మూడుపదులు తీసి రంగన్నకి ఇచ్చేరతను.

"అలాగేనండీ!" రంగన్న వెళ్ళేడు.

"ఎందుకండీ అంత చిల్లర? ఏం జేసుకుంటారు?" ప్రక్కనున్న బస్తాలలోనున్న చిల్లరని చూస్తూ ఆశ్చర్యంగా అడిగేను.

అతను నవ్వుతూ అన్నారు–"ఇదిగో అబ్బాయ్, ఇంత చిల్లరని చూసి ఎవరైనా ఆశ్చర్యపోవడం సహజం. ఇదంతా నీకు ఆశ్చర్యంగాను, వింతగాను వుండొచ్చు. కాని ఇదికూడా మన లాంటి దేశంతో కాలుమీద కాలువేసుకుని బ్రతకదలుచుకునే వారికి జీవనోపాధే! ఈ వృత్తిలో నీకు రెండుచేతులా లాభఁవే గాని నష్టఁవుండదు.

"ఈ గదిలోని చిల్లరబస్తాల్ని చూసి నేను చిల్లరనాణాల్ని ముద్రిస్తున్నానని అనుకునేవ్! అలాంటి పనేగనక్క చేస్తే మారాజులా వందలేళ్ళే వేస్తాను. ఇక అసలు విషయం ఏఁమంటే – ఇక్కడికి కొంతమంది వచ్చి చిల్లర నాణాల్ని ఇస్తుంటారు. వాళ్ళు ముష్టివాళ్ళే కావొచ్చు. మహాపురుషులే కావొచ్చు. ఎవరైనాకానీ మనకు కావాల్సింది–వాళ్ళు తెచ్చే చిల్లర! వారినిచూసి మనం అసహ్యించుకోకూడదు. వాళ్ళపైనే మన జీవనోపాధి ఆధారపడివుందన్న విషయం ఎట్టిపరిస్థితిలోను మనం మరచిపోకూడదు. వాళ్ళిచ్చే చిల్లర నీవు తీసుకోడం–ఎంతవుందో సరిగ్గా లెక్కపెట్టి నాకు చెప్పఁడవే నీవు చేయాల్సినపని!

"ఈపనిని ఇంతవరకూ ఆ రంగన్న కొడుకు చేశాడు. వాడికి ఎక్కడో ఉద్యోగం ఐందట. వెళ్ళిపోయాడు. అందుకనే నాకు మరొకరి అవసరం వచ్చింది. చాలాకాలం నేనే ఇదంతా చూసుకున్నాను. కానీ వయస్సుమీద పడ్డంతో డబ్బు సంపాదించాలన్నఆసక్తి తప్పించి – ఓపికమాత్రం లేకుండా పోయింది. అన్నిరోజులూ నీవు రానవసరంలేదు. మన 'కస్టమర్స్' నూటికి ఎనభైవంతులు దేవాలయాలు దగ్గరుండే ముష్టివాళ్ళు! సోమవారం – శివాలయం దగ్గర్నుంచి, మంగళవారం–ఆంజనేయస్వామి కోవెలదగ్గర్నుంచి!–లక్ష్మీవారం కనకమహాలక్ష్మిఅమ్మవారి కోవెల దగ్గర్నుంచీ; శనివారం – వేంకట్రఁమణ్మూర్తి కోవెలదగ్గర్నుంచి ఎంతోమంది ముష్టివాళ్లు ఇక్కడికి వస్తారు. వాళ్ళిచ్చే చిల్లర్ని జాగ్రత్తగా లెక్కపెట్టి నాకు చెబుతుండాలి. ఇంతే నీవు జేయాల్సిన పని."

"ఏం? వాళ్లు మనదగ్గరికి మాత్రమే ఎందుకొస్తారు?" ఆశ్చర్యంగా అడిగేను.

అతను నామాటలకి మందహాసం

ఫోన్ : 888

నమ్మకానికి
నాణ్యతకు
నిలయం!

సూర్య
జ్యూయలర్స్
III
గుండువారి వీధి
రాజమండ్రి

చేస్తూ అన్నారు : ఆ ముష్టివాళ్ళని–వాళ్లు తెచ్చే ముష్టిపైసల్ని ఎంతమంది అసహ్యించుకోకుండా వుంటారు? పైగా మనం వారికి నెలచివర్లో వాళ్లు నెలంతటా ఇచ్చే చిల్లర్నిబట్టి కొద్దో గొప్పో కమీషన్‌కూడా ఇస్తుంటాం. బుధవారం–శుక్రవారం–ఆదివారంనీవు ఓ అరగంట మాత్రంవే ఇక్కడుండి వెళ్ళిపోవచ్చు. ఆరోజుల్లో హోటల్ యజమానులుగాని–బస్సులవాళ్ళుగాని– ఇంకా చిల్లర అవసరమైనవాళ్ళు మనదగ్గరికి వస్తుంటారు. మనం ఇచ్చే ప్రతి ఎనభై పైసలకి వాళ్ళు కళ్ళకద్దుకొని రూపాయి నోటిస్తారు. సాధ్యమైనంతవరకు మనం ఇచ్చేవి పదులు–ఐదులు అయ్యేట్లు జాగ్రత్త పడాలి. అప్పుడప్పుడు కొందరు విడిరూపాయి నోట్లకోసంకూడా ఇక్కడికి వస్తుంటారు. అలాంటపుడు మనం ఇచ్చే తొంభై విడినోట్లకి నూర్రూపాయలు సంపాదించొచ్చు.

"మరో ముఖ్యవిషయం:—ఈమధ్య చాలామట్టుకు దేవాలయాల్లో దక్షిణ రూపేణ వస్తున్న చిల్లరని పూజార్లే హోటల్‌వాళ్ళకి– బస్సులవాళ్ళకి మంచి కమీషన్‌మీద సప్లై చేసేసున్నారట! వాళ్ళదగ్గర్నుంచికూడా ఎలాగోలా మనం చిల్లర రాబట్టే ఉపాయం ఆలోచించగలిగితే బావుంటుంది.

"ఇహ పొదుపు ఉద్యమం ద్వారా చిన్నపిల్లలు తమింట్లో చిన్నచిన్న హుండీల్లోను దాచుకుంటున్న చిల్లరని రంగన్న ఇంటింటికెళ్ళి సేకరిస్తున్నాడు. వాడు సేకరించే చిల్లరనికూడా ఏదో

ఒకరోజు వీలుచూచుకుని లెక్కచూసే బాధ్యత నీదే!

"ఒకప్పుడు పార్ట్‌టైంగా ఎన్నుకున్న ఈవృత్తి - రిటైరైన ఈరోజుల్లో నాకు సహాయకారిగా వుంటున్నది. నీకిష్టమైతే నాకు సహాయంగా వుంటూ ఈ వృత్తిని సాగించొచ్చు. ఆఖరుగా మరొక్క విషయం! అదే నీ జీతం మాట!" ఆయాసం తీర్చుకోడంకోసమన్నట్లు చెప్పడం ఆపి కూల్‌డ్రింక్‌ని సిప్‌చేయ సాగేరతను. "నెలకి ఈవ్యాపకంద్వారా మీరెంత సంపాదిస్తున్నారు?"

నాప్రశ్నకి నవ్వుతూ చెప్పేడు సమాధానం - "మనం ఎంత కష్టపడితే అంత! కష్టపడి పనిజేస్తే బాగానే గిట్టుబాటవుతుంది. సుమారు ఆరేడొందలకి ఎట్టిపరిస్థితుల్లోనూ తగ్గదు."

"నిజంగా!!

"అవును, అక్షరాల అంతే! ఇంకా ఎక్కువకూడా రావొచ్చు."

విషయాన్నంతా అర్థంచేసుకున్న నేను కొన్నిక్షణాలు ఆలోచించి నా అభిప్రాయాన్ని వ్యక్తంచేశాను: "మీకెలాగూ ఓపిక లేదంటున్నారు. ఈపనిని మీరొక్కరూ సవ్యంగా ఎలానూ చేయలేరు. నా అవసరంకాకున్నా - నాలాంటివారి అవసరం మీకు ఎంతేని అవసరం కదా? ఇన్నాళ్ళూ నీతిగా - నిజాయితీగా బల్లక్రిందకి చేతులు పోనీకుండా బ్రతికాను. ఫలితంగా చాలీచాలని జీతంలో నడుస్తున్న శవంలా తయారయాను. నా జీతం ఎలానూ నా అవసరాలకి సరిపోదు. అదనంగా నాకు డబ్బుకావాలి. అందుకనే మీలాంటివారిదగ్గరికి రావాల్సొచ్చింది. అందుకని .... మీకు ఏ నలభయ్యో - యాభయ్యో నాకిచ్చేకంటే-నన్నోపార్ట్‌నర్‌గా అంటే భాగస్వామిగా తీసుకుంటే-అన్నివిషయాల్ని సవ్యంగా-సక్రమంగా బాధ్యత వహించి చేస్తాను. శ్రమంతా నేపడినా ఫలితం మాత్రం ఇద్దరిదీను! ఒక్కషరతు! ఎట్టి పరిస్థితులోను నాపేరు బయటికి రాకూడదు. ఏమంటారు ?"

అతను కొన్ని క్షణాలు ఆలోచల్లో మునిగి—

"మొత్తానికి గడుగాయివే!" అంటూ తనసమ్మతిని తెలియజేశారు.

ఎలాగైతేనేం —

ఏదైతేనేం ?—

నాకూ ఓ' పార్ట్ టైమ్ జాబ్ దొరికింది.

---

మౌనిగా కూర్చున్న జ్ఞానికన్నా మనిషిగా
తిరుగుతున్న అజ్ఞానే నయం

---